
# ఆశత

—మహేంద్ర

సుబ్రమణి పుస్తకాల సంచీని భుజానికి తగిలించుకుని మట్టి బాటపైకి వచ్చాడు. రాత్రంతా కురిసిన వర్షం వల్ల ఆకాశం ఇంకా మేఘావృతమై వుంది. చల్లగా గాలి వీస్తోంది. వర్షం కురిసిన నేలపై వింత పరిమళాలు వ్యాపిస్తున్నాయి. గాలి వీచినప్పుడల్లా రాత్రి కురిసిన వాన స్మృతుల్ని నెమరేసుకుంటున్నట్టుగా చెట్లు జలజల నీటి బిందువుల్ని రాలుస్తున్నాయి.

సుబ్రమణి చేతులపైకి జారిపోతున్న సంచీని భుజంపైకి లాక్కుంటూ నడవసాగాడు. వాడికి పోయిన పండగ నెలతో ఏడేండ్లు నిండినాయని వాడి అవ్వ లక్ష్మమ్మ, తాత వెంకటసామి రోజుకు నాలుగైదుసార్లయినా అనుకుంటూ వుంటారు. 'పెరిగే పిల్లవాడు కదా చేతులు బాగా పొడుగ్గా కుట్టు' అంటూ వెంకటసామి దర్జీ దగ్గర ఒక పూటంతా కూర్చుని పిల్లవాడికి బట్టలు కుట్టించడం వల్ల సుబ్రమణి వేసుకున్న చొక్కా మోకాళ్ళ దాకా దిగి క్రిందనున్న షరాయి అంగుళం మేరకు మాత్రం కన్పిస్తోంది. వాడు తగిలించుకున్న సంచీ సాధారణంగా బడిపిల్లలు తగిలించుకునే పొడుగు లాడాల పుస్తకాల సంచీ కాదు. అది వాడి తాత వెంకటసామి ఇంటి సెలవుల కోసం ఉపయోగిస్తూ వుండినది. సంచీలో పలక, ఎక్కాల పుస్తకము, పాత పెద్ద బాలశిక్ష, చిన్న సత్తు కారియర్లో పెరుగన్నమూ వున్నాయి. రెండో తరగతి నుంచీ మూడో తరగతికి వచ్చినప్పటి నుంచీ సుబ్రమణి తనకు తెలుగు వాచకం కావాలని తాత దగ్గర మారాము చేస్తూనే వున్నాడు. కానీ మనవడికి కనీసం ఎలిమెంటరీ స్కూలు ముగిసేవరకు పెద్దబాలశిక్ష కంటే ఇతర పుస్తకం అవసరం లేదని వెంకటసామి ఘంటాపథంగా నమ్మడం వల్ల వాచకం తీసుకోవాలనుకున్న కోరిక పిల్లవాడికింకా తీరలేదు. సుబ్రమణి జుత్తు వంపులు వంపులుగా మెడ కింది వరకు పెరిగి వుంది. పిల్లవాడిని



మంగలి దగ్గరకు లాక్కెళ్ళి కురచగా క్రాపు కత్తిరించాలని పొద్దున, సాయంకాలం పిల్లవాడి వెనుకబడి తరుముతూ వున్నాడు వెంకటసామి. కానీ సుబ్రమణి లేగదూడలా ఇల్లంతా గెంతుతూ, అదీ కుదరకపోతే వీథిలోకి పరిగెత్తుతూ తాత చేతికి దొరకడం లేదు.

క్రాపు కత్తిరించుకోవడం వరకూ అయితే సుబ్రమణి సిద్ధమే. దీనికితోడు మనవడిని బావి దగ్గరకు లాక్కెళ్లి ఈత నేర్పించే కృత నిశ్చయంతో వున్నాడు వెంకటసామి. బడికెళ్ళడానికి సుబ్రమణి రోజూ రెండు మైళ్ల దూరం పుంత వెంబడి నడవాలి. పుంత దారి కిరువైపులా బావులూ, చాలనిదానికి ఫర్లాంగు మేరా సీతారాముడి చెరువు గట్టు. పిల్లవాడు పొద్దున సద్దెన్నం తిని బడికి బయల్దేరింది మొదలు సాయంత్రం ఆవులు ఇంటికి వచ్చే వేళకు స్కూలు నుంచీ తిరిగి వచ్చేదాకా లక్ష్మమ్మకు పిల్లవాడిని గురించిన చింతే. పొద్దున వాడికి తలకు చమురు రాసి నున్నగా దువ్వేటప్పుడూ, స్నానం చేయిస్తూ ఒళ్ళు రుద్దుతున్నప్పుడూ రాత్రి పక్కనే పడుకోబెట్టుకుని అడవిలో గొల్ల పిల్లవాడి కథ, బలి రాకాసిని చంపిన రాజు కథా చెప్పిన తర్వాత ఆవిడ మనవడితో బడికి వెళ్లేదారిలో బావుల దగ్గర, చెరువు దగ్గర ఎంత జాగ్రత్తగా వెళ్ళాలో చెబుతూనే వుంటుంది.

సుబ్రమణి తడిసిన బాటపై తన అడుగుల ముద్రలు ఎలా ఏర్పడుతున్నదీ గమనించడంతో మట్టిపై తన అడుగులు మరింత స్పష్టంగా వేయడానికి ప్రయత్నిస్తూ పదేపదే వెనక్కి తిరిగి చూసుకుంటూ నడవసాగాడు. అప్పుడప్పుడు సంచీ తెరచి క్యారియర్లోని పెరుగన్నం వల్ల పుస్తకాలు తడవకుండా జాగ్రత్త పడుతున్నాడు. దారిపొడుగునా చెట్లన్నీ పచ్చగా చిగిర్చి వున్నాయి. సీమబాగి చెట్లు ఎర్రగా విరగబూసి వున్నాయి. కోతకు వచ్చిన వరిపైరు వాన వల్ల అక్కడక్కడా నేలకు ఒరిగి వుంది. రోడ్డు కిరువైపుల రోడ్డు పనివారు తవ్విన గోతుల్లో ఎర్రటి వాన నీళ్లు నిలిచివున్నాయి. వంతెనల కింద కొండ వాగుల నీళ్లు వడివడిగా సాగుతున్నాయి. తడి మట్టిపై రకరకాల పురుగులు వలయాలు వలయాలుగా తిరుగుతూ పోతున్నాయి.

దూరంగా వేపచెట్టు దగ్గర సిద్ధారెడ్డిగారి జోడు బావులు కనిపిస్తూనే తత్తరపడ్డాడు సుబ్రమణి. ఎలా అయినా వాటివైపు కన్నెత్తి చూడకుండానే నడిచిపోవాలనే నిశ్చయంతో తొందర తొందరగా నడవసాగాడు. సుబ్రమణికి అప్పుడప్పుడూ వచ్చే భయంకరమైన కలల్లో సిద్ధారెడ్డిగారి జోడు బావుల కల ముఖ్యమైనది. రెండు బావుల మధ్య రెండు మూడు అడుగుల కంటే దూరం వుండదు. ఒక్కొక్కటి పది పన్నెండు మట్లు గల లోతు బావులు. చాలనిదానికి అక్కడక్కడ పెరిగి లోపలికి వేలాడుతున్న వికృతమైన తీగలు, అగాథంలో ఎక్కడో కన్పించే నీళ్లు. ఆ బావుల మధ్యనున్న ఇరుకు దారిలో ఆ పొలాల కాపులందరూ అవలీలగా నడిచిపోవడం సుబ్రమణి ఎన్నోసార్లు చూశాడు. కానీ వాటి మధ్య నుంచీ నడవడాన్ని వాడు కనీసం వూహించలేకపోతున్నాడు. ఈ వానలకు సిద్ధారెడ్డిగారి జోడు బావుల్లో దండిగా నీళ్ళు వచ్చేసుంటాయేమో ననుకున్నాడు సుబ్రమణి.

గత కొన్ని దినాలుగా ముసారా బట్టి వానలు కురుస్తుండడం వల్ల సరిపోయింది గానీ లేకుంటే తాత తనను మళ్ళీ ఈతకని ఏ బావి దగ్గరకో తీసుకునిపోయి వుండేవాడే. చేదు జ్ఞాపకాలతో సుబ్రమణి ముఖం నల్లబడిపోయింది.

ఎండాకాలం యిస్కూలుకు సెలవులు ఇచ్చినాక ఊర్లోని పిల్లలంతా దగ్గర జేరి ఒక మధ్యాహ్నం రచ్చ దగ్గర గోళీలు ఆడుకుంటున్నారు. ఉన్నట్టుండి వీరన్నగారింటిలో నుంచీ వెంకట్రమణ ఎప్పుడూ తన వెనుక వుండే మిత్ర బృందాన్నంతా తీసుకుని రచ్చబండ పైకి వచ్చేశాడు.

'సుబ్బారాయులోళ్ళ కోనేరు బావికి ఈతగొట్టే వాళ్లు ఎవ్వరైనా సరే రావచ్చును' అంటూ వాడు ఒక బహిరంగ ప్రకటన చేసి రాజఠీవితో బయల్దేరాడు. అప్పటికే ఈతకొట్టడం నేర్చుకున్న పది పన్నెండేళ్ల మగపిల్లలందరూ వెంకట్రమణ వెనుక బయల్దేరారు. ఇంకొందరైతే చొక్కాలు విప్పి యింట్లో పారేసి తలలకు తువాళ్ళు చుట్టుకుని నిక్కరు జేబుల్లో సోపు బిళ్ళలు వేసుకుని బయల్దేరేశారు. ఈ హఠాత్పరిణామం వల్ల రచ్చబండ దగ్గర ఆటస్థలం యించుమించుగా బోసిపోయింది. ఉన్న ఒకరిద్దరు ఆడపిల్లలు చంకల్లో బిందెలు వేసుకుని ఊరబావి నుంచీ నీళ్ళు తెచ్చుకోవడానికి వెళ్లిపోయారు.

సుబ్రమణి దిక్కు తోచకుండా మూతి ముడుచుకుని నేలమీద కొంతసేపు గొంతు కూచున్నాడు. వాడికి ఒక్కసారిగా సిద్ధారెడ్డిగారి జోడు బావుల దృశ్యం గోచరించింది. అందులో తొంగి చూడ్డానికే తనకు చచ్చేంత భయం. మళ్లీ అలాంటి బావుల్లో దూకడమే. ఈ ఈతకు వెళ్లేంత బుద్ధి తక్కువ పని ఇంకోటి వుండదు. "చస్తారు పొండి"– సుబ్రమణి ఉక్రోషంగా గొణుక్కుని చివాలున లేచి ఇంటివైపు నడిచాడు.

బరువుగా అడుగులు వేస్తూ ఇంట్లోకి అడుగుపెట్టాడు సుబ్రమణి. అటూ యిటూ కొంతసేపు తిరిగి దొంతులున్న గదిలోకి దూరాడు. ఇక్కడే ఎక్కడో తన బొంగరం వుండాలి. బొంగరం దొరికితే తాడు లేకపోయినా తన మొలతాడు వుండనే వుంది. బొంగరం వుంటే తనకెవరితోడూ సావాసమూ అవసరం లేదు. మోకాళ్ళ మీద ఒంగి పడుకుని దొంతుల మధ్య, కాగుల మధ్య వెదకసాగాడు సుబ్రమణి.

ఇంతలో వెంకటసామి ఎక్కడి నుంచో తటాలున ఊడిపడ్డాడు. వస్తూనే పశువుల కొట్టంలో పందిరికి వేలాడుతున్న కలబంద బెండ్లను విప్పి, లక్ష్మమ్మతో మనవడు ఎక్కడికి ఫెళ్ళాడంటూ గొంతు చించుకోసాగాడు.

దొంతుల గదిలో నుంచీ సుబ్రమణి "ఏం తాతా" అంటూ దీనంగా బయటికి వచ్చాడు. అంతలోనే తాత ఎత్తుకున్న బెండ్లను గమనించి క్రుంగిపోతూ కళ్ళలో నీళ్ల కదులుతుండగా "ఎక్కడికి తాతా" అన్నాడు.

"మళ్లీ యిస్కూలు తెరిచే లోపల నువ్వు ఈత నేర్చుకోవాల. లేకపోతే పొద్దున నువ్వు యిస్కూలుకు ఎలబారింది మొదలు సందేళ ఇంటికి వచ్చేదాకా మీ అవ్వ నన్ను ఒక తావున నిలవనీటం లేదు. లే లేచి ఎలబారు!" అంటూ వెంకటసామి వీథిలోకి నడిచాడు. సమయానికి అవ్వ ఇంట్లో నుంచీ మాయం అవడంతో సుబ్రమణికి ఏడుపు ముంచుకొచ్చేసింది. బలవంతంగా ఏడుపు నాపుకుంటూ తాత వెనుక బయల్దేరాడు సుబ్రమణి.

తాతా మనవలిద్దరూ మట్టి బాట దాటి మడిగట్ల మీదుగా నడువసాగారు. సుబ్రమణి దీన వదనంతో తాత వెనుక భారంగా అడు

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

గులు వేస్తున్నాడు. ఉన్నట్లుండి వాడు గబగబ వెంకటసామి ముందరికొచ్చి తల పైకెత్తి పూడుకుపోతున్న గొంతుతో "ఏం బావికి తాతా" అని అడిగాడు.

"రాయపాటోళ్ల సుబ్బారాయుడోల్ల బావికి. మంచి బావిలే. ఎట్లాంటి కరువు కాలంలో కూడా దాంట్లో నీళ్ళు అయిపోవు. చానా మంచి బాయి" మనవడి భుజం మీద మెల్లగా తట్టి ముందుకు నడిచాడు వెంకటసామి. తాత కనీసం ఒకసారి తన మొగంకేసి తేరిపార జూస్తే, బిగ్గరగా ఏడ్చేద్దామా అన్పిస్తోంది సుబ్రమణికి. నడిచి నడిచి మొరటుదేరిపోయిన పాదాలతో బలంగా అడుగులు వేస్తూ వెంకటసామి తిరిగి చూడకుండా నడుస్తున్నాడు.

"ఎంత లోతు వుంటాది తాతా" మళ్లీ తాత ముందుకు పరిగెత్తుకొచ్చి అడిగాడు సుబ్రమణి.

"ఎంత లోతు. మహా అయితే అయిదారు మట్లు వుంటాది. అయితే ఏ మూలదూకినా రాయి రప్పా లేకుండా నక్కంగా వుంటాది. ఊర్లో నాలుగు తరాల నుంచీ అందరూ దాంట్లో ఈత నేర్చుకున్నోల్లే. తవ్విన ముహూర్తం అట్టాంటిది. గంగి గోవు మాదిరి బావి. మంచి ముహూర్తంలో తవ్వితే మల్ల మనుసులకు బావుల కాడ దిగులేముండాది..." జీరబోతున్న గొంతును సరిచేసుకున్నట్టుగా దగ్గి పిల్లవాడ్ని దగ్గరకు లాక్కుని కొంతసేపు తల నిమిరి మళ్లీ ముందుకు కదిలాడు వెంకటసామి.

దూరం నుంచే బావి దగ్గర పిల్లవాళ్ల ఈదులాడుతూ చేస్తున్న అల్లరి కేకలు విన్పిస్తున్నాయి. కానుగ చెట్ల మధ్య వెడల్పయిన తగ్గు ప్రదేశంలో చిన్నరకం కోనేరులా వుంది రాయపాటోళ్ల బావి. గట్లను ఆనుకుని బావిలో నీళ్లు మధ్యాహ్నపు ఎండలో వచ్చవచ్చగా కదులుతున్నాయి. బావిలో ఈదుతున్న పిల్లలకేసి తృప్తిగా జూస్తూ సుబ్రమణిని బట్టలు విప్పేయమని పురమాయించాడు వెంకటసామి.

సుబ్రమణి అయిష్టంగా బట్టలు విప్పేస్తూ బావిలోకి తొంగిచూశాడు. నిలకడలేని నీటితలం మీద పిల్లలు పడుతూ, లేస్తూ, దొర్లుతూ, మునుగుతూ వున్నారు. ఒకరిమీద ఒకరు నీళ్ళు చిమ్ముకుంటూ, పుక్కిటిలోని కొచ్చిన నీళ్లను ఒకరిపై నొకరు చిమ్ముకుంటూ వున్నారు. ఒకడు కానుగ చెట్టునెక్కి పైనుంచి నిట్టనిలువున గడ్డపాఢలా దూకాడు. మరొకడు కూచున్నట్టుగా కాళ్లు ముడుచుకుని చేతులను కాళ్లకు అడ్డంగా చుట్టుకుని

> ఒక వృత్తాంతం హృదయాన్ని స్పృశించగలిగేదైనా అందులో వ్యక్తం కాగల వాస్తవం లేనప్పుడు కథ కాదు. ఒక వాస్తవాన్ని చెప్పగల రచనైనా అది హృదయాన్ని స్పృశించే వృత్తాంతం కాకుంటే కథ కాదు.
>
> —కాళీపట్నం రామారావు
> 'కథ కథనం'

ముద్దగా నీటిలోకి దూకుతూ చుట్టూ వున్న నీటిని పైకి లేపాడు. కళ్లలో నీళ్లు తిరుగుతున్న సుబ్రమణి పెదవుల చివర్ల నుంచీ చిరునవ్వు ఒకటి తొంగిచూసింది. 'అయితే ఈతకొట్టడంలో కూడా ఏదో ఆనందం వుందన్న మాట'— సంశయిస్తూనే బట్టల్ని విప్పేసి బావిగట్టు మీద నిలబడ్డాడు సుబ్రమణి.

వెంకటసామి నార దారాలతో కలబంద బెండ్లను సుబ్రమణి వీపుకు బిగించి కట్టి వెనక్కి తగ్గాడు. ఒకటి రెండుసార్లు ముందుకు దూకడానికి ఉంకించి అంతలోనే భయంభయంగా ఆగిపోయాడు సుబ్రమణి. 'ఒకసారి తోసేస్తే భయం గియం అంతా ఒదిలిపోతాది' పిల్లవాళ్లు కొందరు కూడబలుక్కున్నారు. సుబ్రమణి లేగదూడలా బెరుకుబెరుకుగా తాతకేసి చూస్తూ వీపుకున్న బెండ్లను విప్పి పారెయ్యబోయాడు. వెంకటసామి మనవడ్ని వారించడానికి చివాలున పైకి లేచాడు. ఒకరిద్దరు పిల్లవాళ్లు సుబ్రమణి పెడరెక్కలు పట్టుకున్నారు. విలవిల కొట్టుకుంటూ బావురుమన్నాడు సుబ్రమణి. సుబ్రమణి భయపడినంత- పని జరగనే జరిగింది.

బావిలో పడిన సంఘటన తలచుకుంటే సుబ్రమణికి ఇప్పటికీ అదురుపుడుతోంది. కాళ్ల కింద, తల మీద, చెవులు వినపడకుండా, కళ్ళు బైర్లు కమ్మినట్టుగా, ముక్కులోకి వచ్చేసినట్టుగా, చుట్టూ నీళ్లే. కనీసం తను బావిలో మునిగి లేవడానికి ఎన్నో యుగాలు పట్టినట్టుగా వుంది సుబ్రమణికి. తన తెలివి తనకు వచ్చేసరికి బావిలో పిల్లన్నీ అల్లకల్లోలంగా వున్నాయి. గట్టిగా నిలబడి జరిగిపోతున్న ఉపద్రవాన్ని పరికించడానికి కూడా ఒక ఆధారం లేదు. ఆధారమన్నది చేతికి దొరక్కపోగా పక్కనున్న పిల్లలపైకి పడబోయాడు సుబ్రమణి. వారిలో కొందరు సుబ్రమణిని విదిలించుకుని దూరంగా జరిగి అక్కడినుంచి వెక్కిరించసాగారు. మరికొంతమంది మునిగిలేస్తున్న సుబ్రమణిని చూస్తూ 'అద్దిరా అద్దిరా' అంటూ వెర్రి ఆనందంతో కేకలు పెడుతున్నారు. చివరకు ప్రాణాలకు తెగించినట్టు మొండిగా ఎలాగో గట్టు మీదకు వచ్చేశాడు సుబ్రమణి.

గట్టుమీద కొస్తూనే గబగబ బెండ్లను విప్పిపారేసి, చొక్కాయిని, షరాయిని చంకలో యిరికించుకుని అప్రమత్తుడైపోయాడు. వెంకటసామి మనవడి వాలకం గమనించి వారిస్తూ ముందుకు దూకబోయాడు. తాత నోటిలో మాట నోటిలో వుండగానే సుబ్రమణి పొలాల కడ్డం బడి అడుసుమళ్లను తొక్కుకుంటూ, పెడబొబ్బలు పెడుతున్నట్టుగా గట్టిగా అరుస్తూ దూరంగా పరుగెత్తసాగాడు

పరుగెత్తిపోతున్న సుబ్రమణిని పట్టుకోవడానికి ఈతకొడుతున్న పిల్లలు కొంతమంది ప్రయత్నించారు. వెంకట్రమణ అందరికంటే ముందు పరుగెత్తి సుబ్రమణిని వాటేసి పట్టుకున్నాడు. సుబ్రమణి గొంతు చించుకున్నట్టుగా పెడబొబ్బలు పెట్టి వెంకట్రమణ చేతుల్ని కొరికి అందిన చోటల్లా గోళ్ళతో రక్కి తప్పించుకుని పరుగెత్తసాగాడు.

ఇంక తనవెవరూ తరిమి పట్టుకోలేరనేంత దూరం పరుగెత్తిన తర్వాత సుబ్రమణి కొంచెం నింపాదిగా నడవసాగాడు. కన్నీళ్లతో చెంపలు చారలుగట్టాయి. జుట్టు చెదరి చెల్లాచెదరయింది. వంట కాలువ పక్కనున్న కానుగ చెట్టు కింద నిలబడి సుబ్రమణి చంకలో యిరికించుకున్న చొక్కాయిని, షరాయిని వేసుకున్నాడు. వాడికి ఊర్లోకి వెళ్లడానికి మనస్కరించలేదు. ఊర్లో మళ్లీ పిల్లలందరూ కన్పిస్తారు. తాత తాట వొలిచేస్తాడేమో. సుబ్రమణి వరిమళ్ల దాటి, సెనగ చేర్ల కవతల వున్న చింతల గుట్ట దగ్గరికెళ్ళి చెట్ల మధ్య, నీడ పాటునున్న ఎత్తయిన బండనెక్కి కూచున్నాడు. మధ్యాహ్నపు ఎండలో పచ్చని పొలాలు, చెట్లు, దూరంగా వూరు, అక్కడక్కడా బలహీనంగా విన్పిస్తున్న రైతుల కేకలు, ప్రపంచం జీవన వ్యాపారంలో మునిగిపోయి వుంది. ఎవరూ తనను ఇక్కడికి వెదుక్కుని వచ్చే ప్రమాదం లేనట్టే. సుబ్రమణి మొలతాడులో నుంచీ పిన్నును తీసి అరికాళ్లలో గుచ్చుకున్న ముండ్లను కుట్టుకోసాగాడు.

సుబ్రమణి విప్పి పారేసిన కలబంద బెండ్లను

స్వచ్ఛమైన ఆయుర్వేదిక్
# ధన్వంత్రి
# ఆయిల్
హెయిర్ టానిక్
కేరళ నుండి నాణ్యమైన ఉత్పత్తి




మీ ఆహ్లాదమైన తాజాదనము కొరకు ఆయుర్వేద మందులతో తయారైన కేశ సూనె జుట్టు ఆరోగ్యంగా, ఒత్తుగా, మృదువుగా, నల్లగా పెరిగేందుకు సహకరిస్తుంది మరియు తల నొప్పుల నుండి ఉపశమనం, జుట్టు తెల్లబడడాన్ని, రాలిపోవటాన్ని అరికడుతుంది. చుండ్రును పారద్రోలుతుంది. అన్ని వయస్సుల వారికి మరియు అందరికి ఉపయోగబడేది.

ఆంధ్రప్రదేశ్ కి పంపిణీ దారులు
తమాజ మార్కెటింగ్
సికింద్రాబాదు
ఫోన్: 834506

తయారు చేయువారు:
P & N Co.
పి.బి. నం.1886,
కొచ్చి -682017 కేరళ

కట్టుగా కట్టుకుని నల్లబడ్డ ముఖంతో రెండున్నర గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చాడు వెంకటసామి. ఇంట్లో సుబ్రమణి అయిపు లేదు. మనవడు రాకపోవడంతో లక్ష్మమ్మ కండ్ల నీళ్ళు కుక్కుకుని ఏడుపు ముదలంకించుకుంది. ఏడ్చుకుంటూనే ఆమె ఊర్లోని ప్రతి ఇంటికీ వెళ్లి మనవడు వచ్చిందీ లేనిదీ— పిల్లలెవరైనా వాడిని చూసిందీ లేనిదీ అడుక్కుంటూ తిరగసాగింది. మొదట లక్ష్మమ్మకు సర్దిచెప్పినా, సాయంత్రం కామకాను వెంకటసామికి ధైర్యం కొంచెం కొంచెంగా సడలసాగింది. సాయంత్రం నాలుగయిదు గంటల ప్రాంతంలో మెల్లగా ఇంటికి చేరాడు సుబ్రమణి. రావడంతోనే అవ్వ ఒడిలో దూరి బావురుమని ఏడవసాగాడు. లక్ష్మమ్మ మనవడిని సముదాయించబోయి మధ్యలో ఆదమరిచి ఆమె కూడా ఏడ్చింది. తాత తననేమీ అనకపోవడంతో ఈత బాధలు ఇక తనకు తప్పిపోయినట్టేనని అనిపించింది సుబ్రమణికి.

లక్ష్మమ్మ మనవడి తలకు చమురు రాసి సన్నగా దువ్వి సొంత బానలో కాగిన వెచ్చని నీళ్లతో ఒళ్లికి బోసి, చలవ గుడ్డలు తొడిగి సేదతీర్చింది. పగలంతా ఎండలో పడిగాపులు పడడం వల్ల విపరీతంగా అలసిపోయిన సుబ్రమణి పొద్దుపోకముందే తిని మంచం మీద పడి నిద్రబోయాడు. నిద్రలో సైతం వెక్కిళ్ళు పెడుతున్న మనవడిని చూసుకుంటూ ముసలివాళ్లిద్దరూ చాలా రాత్రి దాకా నిద్రపోలేదు.

లక్ష్మమ్మకు మనవడినీ, చనిపోయిన వాడి తల్లినీ తలుచుకుని ఏడ్చుకోవడం తోటే ఆ రాత్రి తెల్లారి పోయింది.

ఆ తరువాత నాలుగైదు రోజులు ప్రశాంతంగా గడచిపోయాయి. స్కూలు తెరవక ముందే మనవడికెలాగైనా ఈత నేర్పించేయాలన్న తన పూనికను ఒక శుభోదయాన బైట పెట్టాడు వెంకట సామి. లక్ష్మమ్మ మొగుడి కసుర్లకువెరచి మనవడి గోడును భరించలేక పొరుగిండ్లను బట్టుకు తిరగ సాగింది. తాత బారినుంచీ తప్పించు కోవడం కోసం సుబ్రమణి దొంగెత్తులు వేసుకున్నాడు. పసువుల కొట్టంలో వాసాలకు వ్రేలాడుతున్న బెండ్లను విప్పి ఒక రోజు గుట్టు చప్పుడు గాకుండా పెరట్లోని నీళ్ళ బాన క్రింద పొయ్యిలో పెట్టేశాడు. అవి సగం కాలీకాలక పోవడంతో లక్ష్మమ్మ వాటిని గోడకవతల దిబ్బలోకి విసిరి పారేసింది. చేంతాడుతో కట్టి బావిలోకి విసిరేస్తే గానీ భయం పోదని, అందుకు కూడా తెగించాడు వెంకట సామి. చివరకు వెంకటసామి నుంచి సుబ్రమణిని రక్షించడానికి లక్ష్మమ్మ ఊర్లో కనీసం సగం మందికి తెలిసేలా చిన్న సైజు ఆగడం చేయవలసి వచ్చింది.

సుబ్రమణి మల్లన్నగారి మామిడితోపు దాటి వచ్చేశాడు. దూరంగా బాట ప్రక్కనున్న మర్రిచెట్టు కన్పిస్తోంది. అవ్వ తనకు రోజూ చెప్పే కథల్లోని మాయల మర్రిచెట్టు యిదేనని సుబ్రమణి అనుమానం. చెట్టు క్రింద దట్టంగా రాలిన ఎండు టాకులు, వంపులు తిరిగి వ్రేలాడుతున్న వూడలు, అక్కడక్కడ తొర్రబారు తున్న మొదలు- సుబ్రమణికి మర్రిచెట్టు అనేక రహస్యాలకు ఆవాసంగా వున్నట్టు కన్పిస్తుంది. చెట్టు నీడలో ఏడు సమాధులున్నాయి. అవి అక్కడక్కడ వానకు తడిసి నల్లటి చారలు గట్టి వున్నాయి. కొన్ని మరీ పాత బడి, సున్నపూడి ఇటుకలు కన్పిస్తున్నాయి. సుబ్రమణికి ఆ చెట్టు ప్రక్కన నడవాలంటే ప్రతిసారీ భయం భయం గానూ, నడచిన తర్వాత ఒక సాహసంగానూ అన్పిస్తుంది. అందులో కొత్తగా కన్పించే సమాధి తన తల్లిదట. అవ్వతోగానీ, తాతతో గానీ ఆదారిలో వచ్చినప్పుడు వారు తనను చెట్టు క్రిందకు తీసుకెళ్లి సమాధిపైన కూచోబెట్టి కళ్ల నీళ్ళు బెట్టుకోవడం సుబ్రమణికి బాగా అనుభవం. ఆ సమాధిపైన వేసిన వెల్ల యింకా నల్ల బడలేదు. సమాధిపైన తులసి మొక్క ఎండి పోయి వుంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న గాలివానల వల్ల సమాధిపైన ఎండు టాకులు, చెత్తా చెదారం పేరుకుపోయి వున్నాయి. చెట్టుకేసి బిక్కు బిక్కుమని చూస్తూ నడవ సాగాడు సుబ్రమణి.

సుబ్రమణికి తల్లిని తలచుకున్నప్పుడు కన్పించే ఆకారం ఛాయా మాత్రంగా వుంటుంది. అవ్వ, తాత పదే పదే చెప్పకోవడం వల్ల వాడు దాన్ని అపురూపంగానే భావిస్తున్నాడు. ఆమె పచ్చి పసుపు కొమ్ములా వుండేదట. విందుగా విచ్చుకున్న చేమంతి పువ్వులా వుండేదట. విరబూచిన నిత్యమల్లె చెట్టులా వుండేదట. ఆమె యింట్లో తిరుగుతూ వుంటే నట్టింట్లో దీపం వెలుగుతున్నట్టు వుండేదట. తీరిక దొరికి నప్పుడల్లా కూతురి ముచ్చట్లు గురించి ఇరుగు పొరుగు వారితో చెప్పకోవడం లక్ష్మమ్మకున్న కొద్ది వ్యాపకాల్లో ఒకటి. పెద్ద పండుగ వెళ్లిన కొన్ని రోజుల తర్వాత ఒక రోజు మధ్యాహ్నం తన తల్లి తనకు పాలిచ్చి ఊయల్లో వేసి నిద్ర వూపి బట్టలు


KANARA/H/91

పుతుక్కురావడం కోసం ఊరికి ఉత్తరంగా వున్న దిగుడు బావికి వెళ్లిందట. బావిమెట్ల మీద కూచొని బట్టలు ఉతుకుతూ కాలుజారి ఆమె బావిలో పడి పోయిందట. సిద్దారెడ్డి గారి జోడు బావులు కూడా ఆ బావి అంత లోతు వుండవట. చనిపోయిన తన తల్లిని చూడడానికి ఇరుగు పొరుగు వూర్ల నుంచీ దండిగా మనుషులు వచ్చారట. నున లావిడ ఒక నిట్టూర్పుతో ప్రారంభమైన ఈ కథ. మధ్యలో ఏడుపు అనే ప్రవాహాన్ని కలుపుకుని- కూతురు చనిపోయిన కథ, అందు వలన వారు అనుభవించిన వ్యధ అంతా కలిపి దుఃఖ సాగరం అయిపోతున్నట్టుగా వుండేది. బయట హోరున వర్షం కురిసి తుపాను బీభత్సం తాకిడికి ప్రకృతి అంతా కంపించి పోతుండగా తల్లి రెక్కల కింద గువ్వపిట్టలా అవ్వ ఒడిలో కూచొని సుబ్రమణి ఈ కథను అనేక సార్లు విన్నాడు. ఒక్కోసారి వాడికి కూడా ఏడుపు వచ్చినట్టుండేది.

సీతారాముడి చెరువు గట్టు మీదకు వచ్చే సరికి సుబ్రమణికి అడవికి మేత కెళుతున్న మేకలు, ఆవులు ఎదురొచ్చాయి. చాకళ్ళు కొందరు ఆకాశంలో పలుచగా కదులుతున్న నల్లటి మేఘాల కేసి అనుమానంగా చూస్తూ చెరువులో బట్టలు వుదుక్కుంటున్నారు. గాడిదలు కొన్ని నీరెండలో ఉబ్బ బావల దగ్గరున్న బూడిద నేలపై పొర్లుతున్నాయి. కొంత వైపు నుంచీ వీస్తున్న ఈదురుగాలికి చెరువులో అలలురేగి గట్టుకు కొట్టు కుంటున్నాయి.

దూరంగా పిల్లల కోలాహలం వినిపించింది. బడిగంట మోగింది. తరచూ ఆలస్యంగా వెళ్లడం వల్ల అయ్యవారు తిట్టేతిట్లు, తోటి పిల్లల వెక్కిరింపులు గుర్తుకు రావడంతో సుబ్రమణి వడివడిగా నడవసాగాడు.

ఆ సాయంకాలానికి ఆకాశం మరింత తేట పడింది. వాన వచ్చే సూచనలు తగ్గి చల్లని గాలి వీచ సాగింది. ఆహ్లాద కరమైన వాతావరణంలో బడి పిల్లలు చాలా సేపు ఆడుకుని మరీ యిళ్లకు బయల్దేరారు. అలవాటు ప్రకారం సుబ్రమణి వీలయినంత నింపాదిగా పిల్లలందరు వెళ్లిపోయిన తర్వాత యింటికి బయల్దేరాడు.

సీతారాముడి చెరువు గట్టు మీదకు వచ్చే సరికి చెరువు నీటిపై సంజె కాంతులు ప్రతిఫలిస్తున్నాయి. చెరువు నిండి మొరవ బోతున్న శబ్దం వినిపిస్తోంది. చాకళ్లు ఆరిపోయిన బట్టల్ని గాడిదల మీద సర్దుకుని బయల్దేరు తున్నారు. కొన్ని ఎనుములు నీటిలో బండ రాళ్ళలా తేలుతూ గట్టు మీదకు వస్తున్నాయి. పెరిగిన నీటి మట్టం వల్ల చేపలు అక్కడక్కడా ఎగిరి పడుతున్నాయి. నల్లటి చెరువు కోళ్ళు ఎక్కడో మునిగి మరెక్కడో తేలు తున్నాయి. చెరువులో స్నానం చేసిన ముసలి వాడొకడు తడిగా వున్న గోచీ మాత్రం ధరించి చెరువు గట్టు మీద మేస్తున్న పశువుల్ని అదిలించు కుంటూ యింటికి బయల్దేరు తున్నాడు. సుబ్రమణి విస్మయంగా నిలబడి సముద్రంవలె దబకలెత్తుతున్న చెరువు కేసి చూస్తూ నిలబడి పోయాడు.

స్వల్పమైన ఆచ్ఛాదనతో వున్న ముసలివాడు ఆదిమ మానవుడిలా గట్టుమీద అడ్డంగా అటూయిటూ పరుగెడుతూ తొందరగా యింటికి బయల్దేరని గొడ్లను పేరు పేరునా తిట్టుకుంటూ నానా హంగామా చేస్తున్నాడు. పరుగులాంటి నడకతో నడుస్తున్న ముసలివాడి ముందుకు పరుగెత్తి కెళ్ళి, సుబ్రమణి తలయెత్తి అతడి ముఖంలోకి చూస్తూ,

"ఏమియ్యా, ఎనుములు కూడా ఈద గొడ్తాయా" అని అడిగాడు. ఆకుల మధ్య మెరిసే సూర్య కిరణంలా ముసలివాడి గుబురు మీసాల చాటున చిరునవ్వు ఒకటి మెరిసింది.

"పశువులకు ఈత ఒకరు నేర్పించ పని లేదు. చేపలకు, కప్పలకు ఈత ఒకరు నేర్పించాలనా? గువ్వలకు రెక్కలు కట్టుకొని ఎగరమని ఒకరు నేర్పించాలనా? అది వాటి వాటి నైజం. నేను నీయంత వుండంగా సాదూరోళ్ళ బావిలో ఈత నేర్చుకున్నా. మొదటి సారి బెండ్లు కట్టుకోని బావిలో దుకినా. రెండోసారి దూకే తలికి బెండ్లు గట్టు మీదనే జారిపడి పోయినాయి. 'ఇంకేడిది! ఈ పొద్దు సస్తిమి' అనుకుంటి. ఏమయ్యిందో ఏమో, కొంచేపు తలికి జూస్తే నేను నీళ్ళమీద తేలిపోయి ఈత గొడ్తా వుండా. నాకు ఎట్ల ఎట్ల వచ్చేసిందో నాకే తెల్లేదు. దయిర్నం కావాల. దైర్నముంటే ఇదేకాయం బెండు మాదిర తేలిపోతాది. లేకపోతే బండ మాదిర మునిగి పోతాది..." ముసలివాడు పశువుల్ని అదిలించుకుంటూ సాగిపోయాడు.

అర్థంఅయ్యీ కాకుండావున్న ముసలి వాడి మాటలతో సుబ్రమణి మెదడు మొద్దు బారి పోయింది. చెరువుగట్టు మీద నడుస్తుండగా దూరంగా మర్రి చెట్టు క్రింద వున్న సమాధులు కన్పించాయి. సుబ్రమణికి తల్లి పడి చనిపోయిన బావి జ్ఞాపకం వచ్చింది. ఫిరంగి రంధ్రాల్లాంటి సిద్దారెడ్డిగారి జోడు బావులు జ్ఞాపకం వచ్చాయి. రాయపాటోళ్ల కట్టు రాళ్ల బావి జ్ఞాపకం వచ్చింది. ఇంటి ముందున్న చేదబావి, ఊరి ముందరున్న పన్నెండు గిలకల సర్కారు బావి, భజనగుడి ప్రక్కనున్న చీకటి నుయ్యి జ్ఞాపకం వచ్చాయి. ప్రపంచ మంతా బావులతోనూ చెరువుల తోనూ నిండి అంతా జలమయమై పోతున్నట్టుగా అన్పించింది.

చెరువు గట్టు మీద సీతా ఫలం చెట్ల ప్రక్కగా నడుస్తున్న సుబ్రమణికి దూరంగా పశువులు వస్తున్న కలకలం వినిపించింది. వెను తిరిగి చూసే సరికి ఒక ఎద్దు గిట్టలతో నేలను తన్నుకుంటూ, ముకు రంధ్రాల నుండీ సెగలు కక్కుకుంటూ కొమ్ముల్ని ముందుకు సాచుకుని పైకి వచ్చేస్తోంది. సుబ్రమణి గావుకేకపెట్టి ముందుకు పరుగెత్త సాగాడు.

తర్వాత ఏమయిందీ తెలియడానికి సుబ్రమణికి చాలా సేపు పట్టింది. తెలివి వచ్చే సరికి సుబ్రమణి చెరువు గట్టుకు అతుక్కు పోయి వున్నాడు. తల తప్పించి మిగిలిన భాగమంతా నీటిలో తేలిపోతూ వుంది. శరవేగంగా తనమీద పడబోయిన ఎద్దు జాడ కన్పించడంలేదు. సుబ్రమణి మెల్లగా ఒడ్డు మీదకు వచ్చి నిలబడ్డాడు. చీరుకు పోయిన మోచేతుల వంక మోకాళ్లవంక ఒకసారి తేరిపార జూసుకున్నాడు. పడిపోయిన పుస్తకాల సంచీని వెదకి పట్టుకుని మెల్లగా యింటి వైపు నడవ సాగాడు.

జరిగిన ఉపద్రవం నుంచీ సుబ్రమణి కోలు కోవడానికి మరి కొంత సేపు పట్టింది. చెరువు కట్ట దిగి బాట ప్రక్కనున్న మర్రిచెట్టు దగ్గర ఆగాడు సుబ్రమణి.

చెత్తా చెదారమంతా గాలికి కొట్టుకు బోయి సమాధులు తెల్లగా మెరుస్తున్నాయి. మెల్లగా తల్లి సమాధి దగ్గరకు నడచాడు సుబ్రమణి. సమాధి మీద తులసి కోటలో మొక్క చిగురిస్తోంది. సుబ్రమణికి నట్టింట్లో దీపం పెడుతున్న అవ్వ జ్ఞాపకం వచ్చింది.

దూరంగా ఒక నీడ తనవైపే నడచి రావడం గమనించాడు సుబ్రమణి.

'తాతా! నాకు ఈత వచ్చేసింది'- తనను వెదుక్కుంటూ వస్తున్న తాతకు ఎదురుగా పరుగెత్తాడు సుబ్రమణి.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్